క్లుప్తంగా

ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయం


మాట్లాడుతున్న హరికృష్ణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు కార్యకర్తలు చిత్తశుద్ధితో పని చేయాలని ఆపార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం సిద్దిపేటలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలు పదేళ్ల పాటు కేసీఆర్‌కు అధికారం ఇస్తే అప్పులకుప్పగా మార్చారని ఆరోపించారు. ఈనెల 6వ తేదీ సిద్దిపేటకు టీపీసీసీ ఇంచార్జి దీపాదాస్ మున్షి, కాంగ్రెస్ నాయకులు మైనంపల్లి హన్మంతరావు రానున్నారని తెలిపారు. సమావేశంలో సతీష్‌గౌడ్, కలీమొద్దిన్, తిరుపతిరాజ్, నరేందర్, షాబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

టీజేఎస్‌లో చేరికలు


పార్టీలో చేరిన వారితో ప్రొఫెసర్ కోదండరాం

గజ్వేల్‌రూరల్: టీజేఎస్‌లో వివిధ పార్టీలకు చెందిన పలువురు కార్యకర్తలు చేరినట్లు ఆపార్టీ జిల్లా కన్వీనర్ నీరుడి స్వామి తెలిపారు. ఆదివారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ.. జిలాలోని వివిధ పార్టీలకు చెందిన పలువురు కార్యకర్తలకు హైదరాబాద్‌లో టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారని చెప్పారు. కార్యక్రమంలో టీజేఎస్ నాయకులు శ్రీని వాస్, యాదగిరి, స్వామి, పప్పి, ఆమోద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌పై విమర్శలు సరికాదు

గజ్వేల్‌రూరల్: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి 2 నెలలు పూర్తికాకముందే కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేయడం సరికాదని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సర్దార్‌ఖాన్ పేర్కొన్నారు. ఆదివారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన పాలన అందిస్తూ ముందుకు సాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక చౌకబారు విమర్శలు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు బాబు, బాలాగౌడ్, గణేష్, సమీర్, అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి 'ఆపన్నహస్తం'


బాధిత కుటుంబంతో సభ్యులు

గజ్వేల్‌రూరల్: కుటుంబ పెద్దను కోల్పోయిన ఓ నిరుపేద కుటుంబానికి 'ఆపన్నహస్త మిత్ర బృందం' చేయూతనందించింది. మండల పరిధిలోని రిమ్మనగూడకు చెందిన సిద్దాల శివకుమార్‌కు భార్య, ముగ్గురు పిల్లలున్నారు. ఇటీవల అనారోగ్యంతో శివకుమార్ మృతి చెందడంతో బాధిత కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఉంది. సమాచారం తెలుసుకున్న ఆపన్నహస్త మిత్రబృందం సభ్యులు 84వ సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం బాధిత కుటుంబ సభ్యులకు రూ.15 వేల నగదుతో పాటు రూ.5వేల విలువైన నిత్యావసర సరుకులను అందజేసి మనోధైర్యం కల్పించారు. కార్యక్రమంలో ఆపన్నహస్త మిత్రబృందం అధ్యక్షుడు పాశికంటి బాల్‌చంద్రం, ప్రధాన కార్యదర్శి కటుకం శ్రీనివాస్ పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు బానిస కావొద్దు


విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ కిరణ్

హుస్నాబాద్: పట్టణంలోని గిరిజన బాలుర వసతి గృహాన్ని ఆదివారం సీఐ కిరణ్ సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసై భవిష్యత్‌ను ప్రశ్నార్థకం చేసుకోవద్దన్నారు. క్షణికావేశంలో ఎలాంటి తప్పుడు నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. క్రమశిక్షణ కలిగిన జీవితాన్ని అలవర్చుకోవాలన్నారు. ధూమపానం, మద్యపానం, గంజాయి వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

దర్జీలకు ఉపాధి కల్పించాలి

గజ్వేల్‌రూరల్: దర్జీలకు ఉపాధి కల్పించి ప్రభుత్వం ఆదుకోవాలని మేర సంఘం నియోజకవర్గ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బిస్కిన్ బాబు, గూడూరి మల్లేశం కోరారు. పట్టణంలోని మేర సంఘం కార్యాలయంలో ఆదివారం గజ్వేల్ నియోజకవర్గ మేర (దర్జీ) సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రెడీమేడ్ దుస్తులతో దర్జీలకు ఉపాధి లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులకు యూనిఫాం కుట్టే ఉపాధిని కల్పించాలని కోరారు.

పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం



దుబ్బాక మున్సిపల్ పరిధిలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. పట్టణంలోని డబుల్ బెడ్రూం కాలనీలో మురికి కాలువలు శుభ్రం చేయకపోవడంతో మురుగు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. దోమలతో అనారోగ్యం పాలవుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు.
– దుబ్బాక

మలుపు.. ప్రమాదాలకు పిలుపు



ఎనగుర్తి– భూంపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద మలుపు ప్రమాదకరంగా మారింది. సిద్దిపేట నుంచి రామాయంపేట వరకు వెళ్లే రోడ్డు నిత్యం రద్దీగా ఉండడంతో మలుపు వద్ద తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సూచిక బోర్డులు ఏర్పాటుచేయాలని వాహనదారులు కోరుతున్నారు.
– దుబ్బాక రూరల్

ఒరిగిన స్తంభాలు.. జనం బెంబేలు



దుబ్బాక మండల పరిధిలోని పెద్దగుండవెల్లి చెరువు కట్టపై విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. చెరువు కట్టపై నుంచి గ్రామస్తులు రోజూ వ్యవసాయ పనులకు వెళ్తుంటారు. అలాగే కట్ట కింద పొలాలు ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి స్తంభాలను సరిచేయాలని కోరుతున్నారు.
– దుబ్బాకరూరల్

పనులు పూర్తయ్యేదెన్నడో..?


అసంపూర్తిగా తిమ్మాపూర్ ఫంక్షన్‌హాల్

జగదేవ్‌పూర్(గజ్వేల్): గత ప్రభుత్వం గ్రామాల్లో అన్నివర్గాల పేదలకు అందుబాటులో ఉండేలా ఫంక్షన్‌హాల్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టింది. ఒక్క ఫంక్షన్‌హాల్‌కు దాదాపు రూ. కోటికి పైగా నిధులను మంజూరు చేసింది. మండలంలోని చాలా చోట్ల నిర్మాణ పనులు ఐదేళ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి. ఉమ్మడి జగదేవ్‌పూర్ మండలంలోని 29 గ్రామాలు ఉన్నాయి. పీర్లపల్లి, బీజీవెంకటాపూర్ గ్రామాల్లో మాత్రమే పనులు పూర్తి చేసి ప్రారంభించారు. మిగితా చోట్ల నేటికీ నిర్మాణ పనులు ప్రారంభించలేదు. తిమ్మాపూర్‌లో ఐదేళ్లుగా నిర్మాణ పనులు సాగుతూనే ఉన్నాయి. జగదేవ్‌పూర్, ఇటిక్యాల, వట్టిపల్లి, చాట్లపల్లి, చిన్నకిష్టాపూర్ గ్రామాల్లో మాత్రమే నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. మిగితా చోట్ల తీవ్ర జాప్యం జరుగుతోంది. తిగుల్‌లో భోజనశాలకు నిధులు మంజూరై ఏడాది దాటుతున్నా నేటికీ పనులు ప్రారంభించలేదు. దీంతో ఉన్న హాల్‌లో రైతుల ధాన్యం దాచుకోవడానికి, ఆసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. నాలుగేళ్ల కింద నిర్మాణం చేపట్టిన ఫంక్షన్‌హాల్ పనుల్లో జాప్యం జరగడం వల్ల చేసిన పనులన్నీ మరమ్మతులకు చేరుకున్నాయి. పంచాయతీ రాజ్ ఏఈ దేవయ్య మాట్లాడుతూ.. నిర్మాణ పనుల్లో వేగం పెంచుతామని తెలిపారు.


చెరుకు శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

దుబ్బాక అభివృద్ధికి కృషి

తొగుట(దుబ్బాక): దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో తొగుట, ఎల్లారెడ్డిపేట, ఘనపురం, లింగాపూర్, కాన్గల్ గ్రామాలకు కుల సంఘాల భవనాలు, సీసీ రోడ్లు నిర్మించేందుకు రూ. 10 లక్షల చొప్పున నిధుల మంజూరుపత్రాలను ఆయా కుల సంఘాల నాయకులకు ఆదివారం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమన్నారు. గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తామన్నారు. నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి.. సహకరించిన మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఇథనాల్ ఫ్యాక్టరీ వద్దు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గుగ్గిల్ల శివారులో ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణం వద్దంటూ అక్కడ చేపడుతున్న బోరుబావి పనులను ఆదివారం గుగ్గిల్ల, తిమ్మాయపల్లె గ్రామ ప్రజలు అడ్డుకున్నారు. ఆందోళన చేసినా పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగారు. పోలీసులు గ్రామస్తులను సముదాయించినా వినకపోవడంతో పనులు నిలిపివేశారు.

ఇంటికి నిప్పుపెట్టిన నిందితుల రిమాండ్

శివ్వంపేట(నర్సాపూర్): ఇంటికి నిప్పుపెట్టిన నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రవికాంత్‌రావు తెలిపారు. మండల పరిధిలోని దొంతి గ్రామానికి చెందిన సోమగారి ప్రశాంత్, పక్కంటి అమ్మాయి పిట్ల జ్యోతి ప్రేమించుకున్నారు. గురువారం ఇద్దరు శుక్రవారం పెళ్లి చేసుకున్నారు. ఈ విషయం తెలియడంతో అమ్మాయి తండ్రి శివరాములు, అన్న జయేందర్, పెద్దనాన్న భిక్షపతితో పాటు మరికొందరు అబ్బాయి ఇంటికి నిప్పుపెట్టారు. దీంతో వారిని పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుస్నాబాద్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ స్థానం నుంచి పోటీ చేస్తున్న బోయినపల్లి వినోద్ కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో జరిగిన పొరపాట్లను సరిదిద్దుకుంటూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. అలాగే వరంగల్ ఎంపీ అభ్యర్థిగా హన్మకొండ జెడ్పీ చైర్మన్ సుధీర్ కుమార్‌కు అవకాశం కల్పించాలని కోరుతూ హుస్నాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి


క్రీడా సామగ్రిని పంపిణీ చేస్తున్న యాదగిరి

అక్కన్నపేట(హుస్నాబాద్): యువత చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని మాజీ సర్పంచ్ కాశబోయిన యాదగిరి అన్నారు. ఆదివారం మండలంలోని గొల్లకుంటలో హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ సహకారంతో యువతకు క్రికెట్, వాలీబాల్ కిట్లుతో పాటు జిమ్‌కు సంబంధించిన పరికరాలను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత చెడు వ్యసనాలకు బానిసకావొద్దని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ రవీందర్, వార్డు సభ్యులు రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉడకని అన్నం.. నీళ్ల చారు

గురుకులంలో అధ్వానంగా మధ్యాహ్న భోజనం


ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు


ముద్ద ముద్దగా అన్నం

కౌడిపల్లి(నర్సాపూర్): గురుకులంలో విద్యార్థులకు పెట్టే మధ్యాహ్న భోజనం అధ్వానంగా ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సంఘటన మండలంలోని తునికి ఎంజేపీ (మహాత్మ జ్యోతిబాపూలే) బీసీ గురుకుల పాఠశాలలో చోటు చేసుకుంది. ఆదివారం సెలవు కావడంతో తునికి ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాలలో విద్యార్థులను కలిసేందుకు పలువురు తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చారు. కాగా విద్యార్థులకు వండిన మధ్యాహ్న భోజనాన్ని వారు పరిశీలించారు. అన్నం సరిగా ఉడకలేదని, గుడ్డు చారు పేరుతో నీళ్ల చారు పోశారని విద్యార్థుల తల్లిదండ్రులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఓ వైపు విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెడుతున్నామని చెపుతుండగా.. తునికి ఎంజేపీలో మాత్రం ఎప్పుడు భోజనం సరిగా పెట్టడం లేదన్నారు. ఉడకని భోజనం తినడం వల్ల పలుమారు విద్యార్థులకు అస్వస్థతకు గురవుతున్నారని ఆరోపించారు. గురుకుల పాఠశాల, కళాశాలలో విద్యబోధన సైతం సరిగా జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో విద్యార్థులు ఎక్కువగా ఇంటిబాట పడుతున్నారని వాపోయారు. ఈ విషయం ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా.. అతను లేకపోవడంతో విధుల్లో ఉన్న టీచర్‌ని నిలదీశారు. కలెక్టర్, విద్యా శాఖ అధికారులు స్పందించి, విద్యార్థులకు నాణ్యమైన భోజనం, విద్యను అందించాలని కోరారు.

ఘనంగా స్కూల్ కల్చరల్ డే


విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు



సిద్దిపేట: జిల్లా కేంద్రంలోని సెలెస్టియల్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ కల్చరల్ డే స్థానిక చంద్రమౌళి గార్డెన్స్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా చిన్నారులు ఆటపాటలతో అలరించారు. వివిధ వేషధారణలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్లు హన్మంతరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఏఆర్ఆర్ కృష్ణమాచారి, సూపర్‌వైజర్ కృష్ణమూర్తి, టీచర్లు షీమాఫర్‌హీన్, అనిత, రజిత తదితరులు పాల్గొన్నారు.

హరీశ్‌రావును కలిసిన నాయకులు

నర్సాపూర్: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డితో పాటు పలువురు నాయకులు ఆదివారం కలిశారు. అశోక్‌గౌడ్ నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న అనంతరం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఆదివారం హరీశ్‌రావును కలువగా ఆయన అశోక్‌గౌడ్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అశోక్‌గౌడ్ మాజీ మంత్రిని సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, ఇతర నాయకులు అశోక్‌గౌడ్, రాజుయాదవ్, చంద్రాగౌడ్, గోపి, రాంచందర్, బాల్‌రెడ్డి, భిక్షపతి ఆంజనేయులుగౌడ్, దావూద్, శ్రీకాంత్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ సన్మానం



మర్కూక్(గజ్వేల్): మండలంలోని నర్సన్నపేట పంచాయతీ పాలకవర్గ సభ్యుల పదవీకాలం ముగియడంతో జెడ్పీటీసీ మంగమ్మ రాంచంద్రం, ఎంపీటీసీ గోలి నరేందర్ గ్రామస్తులు పాలకవర్గాన్ని సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు నర్సింలు, మాజీ వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ పరామర్శ

జగదేవ్‌పూర్ (గజ్వేల్): నిర్మల్ జిల్లా కుంటి గ్రామానికి చెందిన నరేష్ బతుకుదెరువు కోసం మండలంలోని వట్టిపల్లికి వచ్చి కామెర్ల వ్యాధితో ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న చెలిమి ఫౌండేషన్ సభ్యులు మృతుడి భార్య సంధ్యను పరామర్శించి నగదుతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు తులసీదాస్, సభ్యులు ఆనంద్, శ్రీనివాస్, నర్సింలు, శ్రీనివాస్, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

◆ ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

హుస్నాబాద్: మండలంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న 5 ట్రాక్టర్లను పట్టుకొని మైనింగ్ శాఖ అధికారులకు అప్పగించినట్లు ఆదివారం ఎస్సై మహేష్ తెలిపారు. అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల నిఘా ఉంటుందని తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

◆ జాతర పాట చిత్రీకరణ




మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట మండలంలోని కూటిగల్ సమ్మక్క–సారలమ్మ గద్దెల ప్రాంగణంలో ఆదివారం కేకే మ్యూజిక్ ఆధ్వర్యంలో కేమిడి కనకరాజు స్వీయ దర్శకత్వంలో 'కుర్రోయమ్మ..కుర్రు' అనే ప్రత్యేక భక్తి పాటను చిత్రీకరించారు. ప్రజాగాయకుడు పిన్నింటి రత్నం ప్రారంభించారు. డైరెక్టర్ కనకరాజు మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు నెలవైన ప్రాంతమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ ఆలేటి యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

◆ నూతన కార్యవర్గం



సిద్దిపేటజోన్: సిద్దిపేట కాళ్లకుంట కాలనీ పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కృష్ణహరి, ఉపాధ్యక్షుడిగా దేవదాస్, ప్రధాన కార్యదర్శిగా మల్లేశం, సహాయ కార్యదర్శిగా గణేష్, కోశాధికారిగా నరేందర్ ఎన్నికయ్యారు. వీరికి నియామక పత్రాలను అందజేసి సన్మానించారు.

◆ బ్రహ్మోత్సవాలకు వేళాయే..


దేవతామూర్తులు

కొండపాక(గజ్వేల్): మండలంలోని దుద్దెడలో వెలిసిన స్వయంభు శంభు దేవాలయంలో నేటి నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలకు ఆలయాన్ని ముస్తాబు చేశారు. సోమవారం వినాయక పూజతో ప్రారంభమై బుధవారం శివపార్వతుల కల్యాణ మహోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. అన్నదాన వితరణ, రాత్రి 8 గంటలకు కల్యాణ మూర్తుల ఉత్సవ విగ్రహాల రథోత్సవం ఊరేగింపు నిర్వహిస్తామని స్వయంభు శంభు లింగేశ్వర సేవా సమితి ట్రస్టు పేర్కొంది